**మనుషులు మారని ఈ కాలంలో మనస్సులైనా మార్చుకోవాలి. మొదలు, ముగింపు ఇలా ఉంటుందని, ఉండాలో ఊహించడానికి సినిమాలూ, కథలూ కావు. ఇది జీవితం. అందుకే అనుకున్న విక్కడ జరగదు. ఆశించినవన్నీ చేతికందవు. క్షణికోద్రేకం జీవితం మల్లె పందిరి క్రింద పూలపాన్పు అనిపిస్తుంది. కానీ తర్వాతేమో...**

"సరోజా! చిన్నమామయ్యొచ్చాడే!"

అన్న తల్లి కేక లోపలి నుంచి వినిపించి కూతురికి జడ వేస్తున్నదల్లా తల తిప్పి చూసింది సరోజ.

దొడ్డి గుమ్మంలో నిలబడ్డ సుధాకరం పెదవులపై చిరునవ్వు చిందులేసింది. సంధ్యారుణ కాంతులు అతని కళ్లలో వింత మెరుపులు దిద్దాయి. ముఖం మీదికి ముంగుర్లని తోసి పైరు గాలి పరుగెత్తిపోయింది.

మల్లె పందిరి క్రింద ఒంపు సొంపులు ఆమె నొక బొమ్మని చేసి కూర్చోబెట్టాయి. పూల తెల్లదనం ఆమె కట్టుకున్న చీర తెలుపుతో పోటీ పడుతూంది. ఆమె కళ్లు నవ్వుతున్నా యనుకున్నాడు సుధాకరం. అతని చూపులు తన్ను చుట్టేస్తున్నా యనుకుంది సరోజ.

"కులాసాగా ఉన్నావా?"

"ఆహా! నికేసంలా ..." రిబ్బను ముడివేసి పిల్లని తీసుకొని పైకి లేవబోయింది సరోజ.

"లేచిపోతావేం? కూర్చో ... పరాయి వాడిని కాదుగా!"

"పరాయి వాళ్లు ఈ పందిరి క్రిందికి రారు, మామయ్యా!" ఆమె ఎంత అందంగా నవ్వుతుంది!

కమలని అందుకోబోయా డతను. ఆ పిల్ల తల్లిని వాటేసుకుంది.

సుధాకరం ముఖం చిన్నబోయింది. "ఎప్పుడూ కొత్తే దానికి."

అంతలోనే సర్దుకున్నాడు. "తరుచు వస్తూనే ఉన్నా కదా ... ఇంకా కొత్తేమిటి?"

"నేను దగ్గరుంటే వాళ్లమ్మమ్మ దగ్గరికే వెళ్ల దది ..."

"ఎన్నో ఏడు?"

"వచ్చినప్పుడలా అడుగుతావు ... ఏం, పెళ్లి సంబంధా లేమన్నా చూస్తున్నావా?" సరోజ నవ్వితే బుగ్గలు సొట్టలు పడతాయి. ఆ అందాన్ని తన పెదవులతో స్పృశించాలని ఉవ్విళ్లూరుతాడు అతను.

"వాకు నేనే పెళ్లి చేసుకోలేని వాడిని దానికేం చేయగలను?"

"దాని పెళ్లి కింకా పదే ళ్లాగచ్చు కాని ... ముందు నీ ఇల్లాలిని వెతుక్కో. బెండకాయ ముదిరితే ఎందుకూ పనికి రాదుట!" సరోజ నవ్వు అతనికి చక్కిలిగింతలు పెట్టింది.

"కంటికి రెప్పలా కాచుకునే తోట మాలి సేవలో పూవు లెప్పుడూ వాడిపోవు. కాయ లెప్పుడూ ముదిరిపోవు."

"ఎక్కవలసిన రైలు ఎప్పుడూ దాటిపోనివ్వ కూడదు."

"ఇంకా నా అన్వేషణ పూర్తి కానిదే!"

"ఎండమావుల చుట్టూ అన్వేషణ సాగితే ప్రయోజన మేముంది, మామయ్యా!" అంతలోనే గంభీరంగా మారిపోయింది సరోజ.

"స్వాతివానకోసం ముత్యపు చిప్పలు ఎప్పుడూ నోళ్ళు తెరుచుకునే ఉంటాయి, సరూ!"

ఉలిక్కిపడింది సరోజ. అతని కళ్లలోకి ఒకసారి చూసి చటుక్కున తల దించుకుంది. "ఎండమావు లుండేది ఎడారిలో. అక్కడ ఇసుక తుఫానులు తప్ప స్వాతి వానలు కురవ్వు, మామయ్యా!" సుధాకరం గొంతు వినిపించే లోపల ఆమె వడివడిగా అడుగులు వేస్తూ లోపలికి వెళ్లిపోయింది.

అటువంటి అవకాశం అతని కెప్పుడో కాని రాదు. వచ్చినప్పు డిలా సగంలో తెగిపోతుంది. సరోజ మళ్లీ ఆ ప్రస్తావనకే తావివ్వదు. మరో యుగం ఆగాలి.

ఇది ఈనాటి కథ కాదు. ఇది ఈ కథకి మొదలు కాదు. ఇది కొన్నేళ్ల తపస్సు. ఇది ఒక జీవితకాలం గడిచిన గాథ. ఈ అనుబంధం సరోజ పరికిణీలు కట్టుకునే చిరుత వయస్సు నాటిది. సుధాకరం తన వానర సేనతో రాయుడిగారి తోటలో అర రాత్రి కొబ్బరికాయల వర్షం కురిపించిన అల్లరి రోజుల నాటిది.

అయితే ఇంతవరకు సుఖవంతంగా నడిచిన కథా కాదు. అనుకున్నది అనుకున ట్లుగా జరిగిన కథ అసలే కాదు. కోరికలు తీరకుండా కోరికలుగానే మిగిలిపోయిన కథ. సమస్యలు పరిష్కారం కాకుండా యథాతథంగా మిగిలిపోయిన జీవిత కథ!

మరో రోజు గడిచింది. సుధాకరం ఓర్పు అపరిమితం. ఈ నిరీక్షణలో అతడొక యుగం జీవించగలడు!

తండ్రి ఎక్కడికో పనిమీద వెళ్లాడు. తల్లి వంటింట పనిలో ఉంది. తమ్ముడు, చెల్లెలు ఆడుకోవటానికి పోయారు. దొడ్లో మొక్కలకి నీళ్లు పోయటానికి ఉపక్రమించింది సరోజ. అప్పటికి కొంచెం అలవాటు పడిన కమలని ఆడిస్తూ తన కళ్లతో సరోజ కదలికల్ని అనుసరిస్తున్నాడు సుధాకరం.

ఉన్నట్టుండి, "నా మీద ఈ మొక్కలపై చూపించే శ్రద్ధలో వందో వంతు చూపించినా నా బ్రతు కింత ఎండిన మోడులా ఉండేది కాదు, సరూ!" అన్నాడు సుధాకరం.

వంగి నీళ్లు పోస్తున్నదల్లా చటుక్కున పైకి లేచింది సరోజ. అంత వరకు నీటి తుంపరలతో తడిసి తళతళలాడుతున్న ఆమె ముఖం నేల రాలిన పారిజాతంలా వాడిపోయింది. ఆమె పెదవులు కదిలాయి. కాని ఆమె మాటలు అతనికి వినిపించలేదు.

ఆమె కన్నుల్లో నీళ్లు చిప్పిల్లాయి. అతని కేం చేయాలో అర్థం కాలేదు. అతని కేం చెప్పాలో తెలిసిరాలేదు. మరు నిమిషంలో అత డేమయినా చెయ్యచ్చు. ఏం చేస్తాడో అతనికే తెలియదు. ఏం చెయ్యగలడో ఆమెకు తెలుసు!

చటుక్కున తల తిప్పుకుని కన్నీళ్లొత్తుకుంది సరోజ. మళ్లీ నూతిలో నీళ్లు తోడటానికి వెళ్లిపోయింది. అత నక్కడే శిలలా నిలబడిపోయాడు.

ఆమె మళ్లీ వచ్చి రెండవ వరస మొక్కలు తడుపుతూంది. అతడు రెండడుగులు దగ్గరగా వచ్చాడు. ఆ కబురు గాలి అందజేసింది. అయినా ఆమె తల తిప్పి చూడలేదు.

"నాతో మాట్లాడాలంటేనే విసుగ్గా ఉందా, సరూ!"

చటుక్కున చేతిలోని చెంబు జారవిడిచింది సరోజ. ఈదురుగాలిలో చిటారు కొమ్మలా రెపరెపలాడింది. తూలిపడబోయి పందిరి గుంజని పట్టుకుంది. "నన్నింక అలా పిలవకు, మామయ్యా!" అంతు తెలియని ఉద్వేగాన్ని ఆపుకుంటూంది ఆమె.

"ఏం? ఎందుకని? ఇలా పిలవటం నే నీవేళ మొదలుపెట్టలేదే! జన్మ జన్మల నుంచి నిన్నిలానే పిలుచుకుంటున్నాను, సరూ! కనీసం ఈ కోరికయినా తీరకుండా చేస్తావా!"

"నేను రాయిని. రాళ్ళు పలకవు. కరగవు." తెరలు తెరలుగా వచ్చే దుఃఖాన్ని గుండెల్లో అదిమి పెడుతూంది ఆమె. ఆ వెల్లువని పొంగనివ్వాలని అత డాత్రత పడుతున్నాడు.

## విమలా రామం

"బండరాళ్ళు పలకవు, సరూ! కాని, మంచుబొమ్మలు కొంచెం వెచ్చదనం తగిలితే కరిగి నీరవుతాయి. నీవు మంచు బొమ్మవి!"

"..." ఆమె కొంతసేపటికి దుఃఖాన్ని దిగమింగుకుంది.

"జీవితమంతా ఒక ఋతువులోనే గడిచిపోదు, సరూ! శిశిరం తరవాత వసంతం వస్తుంది. ఇది ఏ కాలంలో నయినా ఒక్కటే! అది ప్రకృతి ధర్మం."

"కావచ్చు. కాని, కాలం మారింది. ఋతువులు గతులు తప్పుతున్నాయి. ఒక్కో జీవితం ఒక్కో ఋతువులోనే ముగిసిపోతూంది. ఇక మనుషులే మారాలి! కాని, మనమంతా మారలేదు. మన చుట్టూ ఉన్న మనుషు లింకా మారలేదు. ఆ మార్పు వచ్చే వరకు మన పరిస్థితులు మారవు."

"ఎవరికి వారు అలా అనుకుంటే ఈ పరిస్థితు లెప్పటికీ మారవు, సరూ! మన కీ అవకాశం వచ్చింది. అది జారవిడుచుకోవద్దు. మనమే ముందడుగు వేద్దాం. మన భవిష్యత్తుని మనమే తీర్చి దిద్దుకుందాం."

"రెండు ముక్కల్లో ఎంత తేలిగ్గా చెప్పావు, మామయ్యా!" ఆమె నవ్వు తెచ్చిపెట్టుకుంది.

"అవును, సరూ! భక్తుడు యుగాలుగా తపస్సు చేస్తాడు కాని, దేవతకి వరమివ్వటానికి రెండు క్షణాలు చాలదా! కోరిక లీడేర్చటానికి రెండు మాటలు చాలవా!"

ఆమె గాఢంగా నిట్టూర్చింది. "న న్నంతగా ఆరాధిస్తున్నావా అని నిన్ను అడగను. కాని, అంతటి ఆరాధనకి నేను తగుదునా అని!"

"మల్లె పువ్వుకి అంత తెల్లదనం అవసరమా అని అడిగినట్లుంది! ఏ పుణ్యం చేసుకుందని పారిజాతాని కంత పరిమళం కలిగింది అని అడిగినట్లుంది!"

"ఎంత పిచ్చివాడివై పోయావు, మామయ్యా!" ఆమె దించిన తల ఎత్తలేకపోయింది. అయినా అతని చిరునవ్వు నవ్వడిని మందమారుతం ఆమె శ్రీకారాలకు చేరవేసింది.

"ఎవడి పిచ్చి వాడి కానందం. పోనీ, న న్నిలా పిచ్చివాడిగానే బ్రతకనియ్యి, సరూ!"

కొంతసేపు ఆమె మాటలు వెతుక్కుంది. రాలిన ఎండుటాకుల్ని ఏరుతూ పని కల్పించుకుంది. ఆమె కోరుకున్నంత వ్యవధి నివ్వాలని అతను అనుకున్నాడు. కాని, ఆరాటంతో ఉన్న మనస్సు అతని కా అవకాశం ఇవ్వలేదు.

"ఎన్నోసార్లు వచ్చి, ఎన్నో రోజులు

# కాలం మారింది




ఉండి అనేక విధాలుగా నీకు నా మనస్సు విప్పి చెప్పాను, సరూ! కాని, అన్నిసార్లూ నన్ను మభ్యపెట్టి, మాట మార్చి వచ్చిన దారినే సాగ నంపావు. నీ అంగీకారంకోసం ఒక జీవిత కాలం ఆగగలిగే శక్తి ఈ శరీరానికి ఉన్నా, ఏ క్షణాని కా క్షణం వేదనతో నిండిన ఈ మనస్సు మండి మసి అయిపోయేలా ఉంది. బహుశా ఈసారి నేను మళ్ళీ మనిషిలా తిరిగి రాలేనేమో! నా మనస్సులోని ఆశాలత లేచి నిగనిగలాడనేమో!"

చటుక్కున తల ఎత్తింది సరోజ. ఒక్క క్షణం అతని కళ్ళలోకి జాలిగా చూసింది. "నే నెంత పొరపాటు చేశాను, మామయ్యా! ఒకనాడు నీకై నువ్వు అందుకుంటావనం టే తొలగదోను కున్నాను. ఆనాడు నేను తప్ప నా దారికి లోకం అడ్డు రాలేదు. కాని, ఈనాడు? అంతా తారుమారయింది. అనుక్షణం ఆ ఆలోచనలతో భయపడిపోతున్నాను."

సుధాకరం తేలిగా నవ్వేశాడు. "నీ భయమంతా ఒక భ్రమ. నిన్ను సుఖపడ వద్దని, నీ వాళ్ళని సుఖపెట్టవద్దని లోకం ఆంక్షలు పెట్టదు. ఒకవేళ లోకం అడ్డు వచ్చినా నువ్వు లెక్కచెయ్య నక్కర్లేదు. నీ కష్టాల్లో నిన్నాదుకోని లోకానికి నీ సుఖాల్లో ఆంక్షలు పెట్టే అధికారం ఎవరిచ్చారు?"

ఒక్క క్షణం రెప్పవేయకుండా అతని వైపు చూసింది సరోజ. మరుక్షణం తల తిప్పుకుని ఆ సంధ్యారాగంలో ఏదో వెతుక్కుంటున్నట్లు దిగంతాలవైపు దృష్టి సారించింది. "సరే, మామయ్యా! నిన్నింక ఆశపెట్టి వేధించను. నాకొక వారం రోజులు గడువియ్యి. నా నిర్ణయం తెలియపరుస్తూ నీకు జాబు వ్రాస్తాను. సరేనా?"

"అంతకన్నానా, సరూ! అటువంటి జాబుకోసం కొన్ని యుగాలు వేచి ఉంటాను."

* * *

సుధాకరం కొన్ని యుగాలు వేచి ఉండ వలసిన అవసరం లేకపోయింది. సరోజ ఇచ్చిన వారం రోజుల గడువు కూడా అవసరం లేకపోయింది. అతడు తిరిగి వచ్చిన రెండో రోజునే ఆమె జాబు వచ్చింది. రెండు ముక్కల్లో 'నన్ను నీదాన్ని చేసుకో! నీ రాక కోసం ఎదురు

చూస్తున్నాను' అని వస్తుందనుకున్నాడతను.

కాని, అది బరువైన ఉత్తరం. భారమైన ఉత్తరం. అవుననని ఉత్తరం. కాదనలేని ఉత్తరం! వణికే చేతులతో ఉత్తరం మడతల్ని విప్పాడు సుధాకరం. ఆర్ద్ర నయనాలతో పంక్తులపై పయనించాడు సుధాకరం!

"మామయ్యా!

నేనీ ఉత్తరం నీ కెప్పుడో రాయవలసింది. నీ ప్రశ్నలకి ఎప్పుడో జవాబు చెప్పవలసింది. కాని, నా అంతట నే నేమీ చెప్ప నవసరం లేదనుకున్నాను. నువ్వే గ్రహించగలవన్న పిచ్చి నమ్మకంతో ఇంత కాలం వృథా చేశాను. ఇన్ని మాటలు గుండెల్లో దాచుకుని కాలమే సమస్యల్ని పరిష్కరిస్తుందని మిన్నకున్నాను.

కాని, అదేమీ జరగలేదు. నువ్వు నా మీద ఆశలు చంపుకోలేదు. పైగా మరింత పిచ్చివాడివై పోయావు. నా కోసమే నీ జీవితమంతా చీకటిపాల్జేసుకున్నావు.

అభిమానం ఉన్నచోట బాధ్యత, బాధ్యతతో బాధలు సంప్రాప్త మవుతుంటాయి. నీకన్నా చిన్నదాన్నయినా జీవితం నేర్పిన పాఠా లివి నాకు. ఇక నే నిప్పుడు బాధ్యతారహితంగా ప్రవర్తించ కూడదు. ఈనాటి సుఖమే శాశ్వత మనుకొని రేపు రానున్న బాధల్ని విస్మరించ కూడదు.

ఇలా అంటే నావన్నీ పిచ్చిభయా లంటావు నువ్వు. కాని, శాంతంగా నా ఉత్తరం చదువు. నా భయాలు ఉత్త అనుమానాలు మాత్రం కావని, అవి కొన్నయినా జీవితం కాచి వడబోసిన నిజాలని గుర్తిస్తావు. అప్పుడు నీ కెలా తోస్తే, నీ కేది సబబనిపిస్తే అలా చేయి. నీ దారికి నేను అడ్డురాను. నీవన్నది కాదనను.

ఆడది పెళ్ళికి ముందు ఒక సంవత్సరానికి ఒక సంవత్సరమే ఎదుగుతుంది. పెళ్ళయ్యాక ఏడాదికి పదేళ్ళు పెరుగుతుంది—శారీరకంగా కాదు, మానసికంగా!

మన చిన్నతనం ఎలా గడిచిందో నా కానాడు తెలియదు. నా కిప్పుడు అదంతా ఎందుకు జరిగిందో అర్థమవుతూంది. బహుశా జీవితం అనుభవించినప్పటికన్న అనుభూతిగా మిగిలినప్పుడే దాని విలువ పెరుగుతుందేమో! దాని అంతరార్థాలు అవగత మవుతాయేమో!

నువ్వు సరిగ్గా ఇంటిపట్టున ఉంటే, ఈనాడు సంపాదిస్తున్న దానిలో పదవ వంతు సంపాదించగల తెలివితేటలు నీ కున్నాయని మా వాళ్ళు ఆనాడే గుర్తిస్తే నీ కనుసన్నల్లో తమ కుమార్తె సుఖిస్తుందని ఆనాడే నన్ను నీదాన్ని చేసి ఉండేవారని నే నిప్పుడు చెప్పబోవటం లేదు. జరగనిది జరిగి ఉంటే ఎంత బాగుండేది అని అనుకోవటం అంత అవివేకం మరొకటి లేదు.

జరగకూడనివి, జరగవనుకున్నవి జరుగుతుంటాయి. అదే. విధివిలాసం! కాని, జరగకూడనివి కొన్ని కాలక్రమేణా జరగవచ్చని అనిపించేటప్పుడు అవి జరగకుండా చూసుకోవటం, ప్రయత్నించటం మంచిదేమో! అంతా విధికి వదిలేసి కాలక్షేపం చేయటం, అదే విధి విలాస మనుకోవటం అవివేక మనిపించుకోదూ? అందుకనే ఈ జీవితానుభవంతో మన ముందుజీవితం ఎలా ఉంటుందో ఊహిస్తున్నాను. ఎలా ఉండకూడదో స్పష్టం చేస్తున్నాను.

ఇప్పటికి నా పెళ్ళయి నాలుగేళ్ళయింది. నాకు మొన్ననే ఇరవై రెండు వచ్చింది. కాని, అప్పుడే నలభై ఏళ్ల జీవిత మనుభవించిన దానిలా బరువైన ఆలోచనలు, భారమైన మాటలు. అంతా నిర్లిప్తత! నా చుట్టూ ఒక శూన్యం. ఏమిటో అర్థంకాని బాధ. భర్త అనే ఆ వ్యక్తి బ్రతికి ఉంటే ఈ చీకటి అనేది లేకపోను. కాని, ఒక క్షణం నా జీవితంలోకి అలా తొంగి చూసి ఆ వ్యక్తి పరమపదించాడు. నా జీవితాంతం ఆ స్మృతులతో గడపమని విధి శాసించింది.

గతించినది కలా, ఈనాటి జీవితం

# అరుణోదయం

## బండ్లమూడి సత్యనారాయణ

అమ్మా!
దీనంగా చూడకు,
నలుగురిలో హీనంగా కనబడకు;
ఎండిన రొమ్ములో, నిండిన కన్నీటితో
అగాధ బాధాజనిత వ్యథతో
అలా అలమటించిపోకు;
ఈనాటి ఉషోదయవేళ—
కక్కటిల్లి ఏడుస్తున్న నన్నూ
దిక్కుమొగం పెట్టిన నిన్నూ చూసి
కన్నీరు నించిన నాన్నగారు—
పాలడబ్బా కోసం బజారుకు వెళ్ళి
పన్నెండయినా తిరిగి రాలేదని. . .
పన్నెత్తు మాట అనబోకు.

అమ్మా!
రత్నగర్భ అయిన ఈ దేశంలో
ఆగర్భ దరిద్రుడిగా పుట్టినందుకు
తల ఎత్తలేకపోతున్నాను నేను.
నీ గర్భశుక్తి ముక్తాఫలంగా ఘనంగా జనాళి
నివాళి అందుకొనే అదృష్టం లేనందుకు
నిలువునా నీరయిపోతున్నాను నేను;
కడుపు తడుముకొంటూ, కాళ్ళీడ్చుకొంటూ
బడికి వెళ్ళిన అన్నయ్యా, అక్కయ్యల కన్నీటి
ఏటిలో
కుత్తుకబంటిగా మునిగిపోతున్నాను నేను;
నీ ఊహాలోకాలలోనో ఊరేగుతున్న నన్ను
ఈ నీ గర్భమందిరంలో నాల్గవ ఖైదీగా
పది నెలలు నిర్బంధించి, చెర వదలించావు,
వదిలంగా నా కళ్ళపొర తొలగించావు.

అమ్మా!
నా దొక విన్నపం, మన్నిస్తావుకదూ!
కాటకాల కీటకాలు కాటు వేస్తున్నచోట
మాటువేసిన స్వార్థపిశాచాలు స్వైరవిహారం
చేస్తున్నచోట
నాడూల బలం పెట్టి చూసే గోడులేకాని
కూడూ, గూడూ, నీడా కొల్లలుగా లేనిచోట
మనుగడ బండిగాళ్ళక్రిందబడి
మానవత్వపు వళ్ళేరు మందుకైనా మిగలని
చోట
ఎలా బ్రతికి బట్ట గట్టమంటావు?
నిండు జాబిల్లినై నీ కడగండ్ల కడలిపై
పండు వెన్నెలను ఇంకెలా పరవమంటావు?
బొడ్డూడని నీ బిడ్డ నిడ్డూరంగా మాట్లాడు
తున్నాడని
ఆశ్చర్యగించి చూస్తున్నావా, పిచ్చితల్లీ!
కార్యాలయంలో కాగితాల కట్టలలో మునుగుతూనో
కాలువనీళ్ళలో తేలుతూనో ఉన్న నాన్నగారి
ముఖం
కడసారిగా చూడాలని ఉందమ్మా నాకు!

అవునమ్మా!
మొన్న కనుతెరచిన నేను
నిన్న కళ్ళారా నిన్నుల్ని చూసిన నేను
కన్ను మూస్తున్నాను నేడు;
ధాత్రీజనని గర్భంలో తలదాచుకొని ఆమెకు
"రత్నగర్భ" అన్న పేరును సార్థకం చేస్తాను
చూడు;
ఈ అకాలజన్మను గురించి అల్లాడుతున్నవేళ
ఈ అవ్యవస్థ నాటకంనుంచి నిష్క్రమిస్తున్న
వేళ
నీ వెందుకు తల మొత్తుకొంటావు?
నా వెందుకు గుండెకు హత్తుకొంటావు?
అదుగో—
మన ఇంటి ఎదుట మహోన్నతంగా కనిపిస్తూ
మానవ కళ్యాణపథంలో మార్గదర్శిగా
వ్యవహరిస్తూ
కళ్ళు మిరుమిట్లుగొలిపించే 'అరుణ త్రికోణం'
నీ జీవితాంధకారానికి అది అరుణోదయం!
అమ్మా, సెలవు. ★

ఒక కల్పనా — అన్నది తేలటం లేదు. బహుశా ఈ ప్రశ్నకు జవాబు దొరికే లోగా నా జీవితం ముగిసిపోవచ్చు!

ఆ వైవాహికానుబంధం అంతా ఒక భ్రమ అని మరే పరిస్థితుల్లో నయినా అనుకునే దాన్నేమో! కాని, ఆతనితో గడిపిన క్షణాలు నిజమని నిరూపిస్తూ కమల రూపంలో నా కళ్లముందు అను క్షణం ప్రత్యక్ష మవుతూంది. ఇక అదంతా కల అని, కల్పన అని మరిచిపో గలగటం సంభవమా?

ప్రయత్నిస్తే, మనస్సు మార్చు కుంటే, జీవితాన్ని సుఖమయం చేసు కుంటే, మరో కొత్త మలుపు తిరిగితే గతమంతా మరిచిపోవచ్చని నీ వనవచ్చు. జీవితాన్ని జీవించటానికేగాని దుఃఖ మయం చేసుకోవటానికి కాదని నాకూ తెలుసు. కాని, ఈనాటి ఒక పాలు సుఖం తరవాత పదిపాళ్ళ దుఃఖాన్ని తెచ్చిపెడుతుందని తెలిసినప్పుడు ఈ సుఖాన్ని నేను కోరుకోలేను. ఈ దుఃఖాన్ని నేను భరించలేను.

కమల నిన్ను తండ్రిగా గుర్తించ టానికి కొన్ని నెలలు పట్టవచ్చు. ఈ అనుబంధం అర్థంచేసుకోవటానికి అయిన వాళ్ల కనేక రోజులు పట్టవచ్చు. కాని, ఈ వ్యామోహం నుంచి తప్పించుకొని వాస్తవాన్ని గుర్తించటానికి నీ కెన్నో ఏళ్లమాత్రం పట్టవు. అదిమాత్రం నిజం!

నీ అనురాగానికి వ్యామోహం అని పేరుపెట్టి నిన్ను శంకిస్తున్నానని నువ్వు బాధపడవచ్చు. చిన్ననాటి అనుబంధాలతో మనస్సులు కోరికల కోటల్ని కట్టుకుం టాయి. వయస్సులో ఉన్నప్పుడు ఆ కోరికలే వేధించి ఆ మనుషులచుట్టూ తిరుగుతాయి. అదే అనురాగం, ప్రేమ అని మనం భ్రమసిపోతుంటాము. ఆ కోరికలు తీరిందే తడవు నివురు గప్పిన నిప్పులా అసలు స్వరూపం బయట పడుతుంది. అప్పుడు నిజమైతే అను రాగం నిలదొక్కుకుంటుంది. ఇద్దరి జీవితాల్ని ముడివేసి ముందుకు నడిపించి సుఖాంతం చేస్తుంది. లేదూ — ఇక నిత్యం ఒకర్ని ఇంకొకరు పూర్వాపరాలు వల్లెవేసుకుంటూ అతి నీచంగా నిందించు కునేలా దిగజార్చి వేస్తుంది. అప్పుడు జీవితమంతా నరక సదృశమైపోతుంది. అదే నా భయం.

'అయితే నీ మీద నీకే నమ్మకం లేదా? నీ భవిష్యత్తుని నరకప్రాయం చేసుకోకుండా చూసుకోలేవా? అంత ఆలోచన ఉన్నదానికి రాబోయే కష్టాల్ని ఎదుర్కొనే మార్గం కూడా తెలిసి ఉండాలి కదా?' అని నీ వనవచ్చు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే నా కీ జీవిత మేమిటో అర్థం కాకపోవటంవల్లనే నా కిన్ని అనుమానాలు వస్తున్నాయి. నే నెలా బ్రతుకుతున్నానో తెలియకనే ఇన్నివిధాల భయపడుతున్నాను.

ఏదో ఒకనాడు, ఏదో ఒక సందర్భంలో గుర్తు వచ్చి గతించిన భర్త గురించి ఆయన ఇలా అనేవారనో, లేక ఇలా చేసేవారనో నేను అన్నాననే అనుకో — అప్పుడు నీ కేమనిపిస్తుంది? ఏమో! ఏమయినా అనిపించవచ్చు. ఇంకా నే నా గతానుభూతులతో మనస్సు నింపు కుంటూ నిన్ను చిన్నచూపు చూస్తున్నా ననుకోవచ్చు. నీకు హృదయా న్నర్పించి నన్ను పూర్తిగా నీదాన్నిగా చేసుకో నివ్వ లేదని నువ్వు మథనపడవచ్చు. ఈ వ్యామోహంలో, ఈ ఆవేశంలో ఎంతో విశాల మనిపించిన నీ హృదయమే ఆనాడు నేను నీ స్వంత మయాక అంతా తనకే చెందాలన్న సంకుచితత్వానికి లోనుకావచ్చు. అప్పు డా భావాల్ని తట్టుకునే మనః స్థైర్యం నా కుంటుందో, ఉండదో నేను చెప్పలేను. నీ కుంటుందో, ఉండదో నేను ఊహించలేను.

సరే, ఇటువంటి అల్ప విషయా లన్నిటికీ అతీతమయినదే మన అనురాగం అనుకుందాం! పన్నెప్పటికీపువ్వుల్లో పెట్టి చూసుకుంటావే అనుకుందాం! నన్ను నీవు, నేను నిన్ను నిందించుకునే పరిస్థితి ఎప్పటికీ రాదనే అనుకుందాం!

మరి మన చుట్టూ ఉన్న లోకం మాటే మిటి? ఈ లోకం మనం నిజంగా సుఖి స్తుంటే నిర్లిప్తంగా ఊరుకుంటుం దనుకున్నావా? మనల్ని మనం హింసించు కుని అశాంతి పాలయ్యే వరకు వేటాడి, వెంటాడుతుంది. మన జీవితాన్ని ముళ్ళ బాటలపై నడిపించి హాయిగా పక్క నుండి చూసి పరిహసిస్తుంది. వాడిన పూలను వికసింపజేయటం ఈ లోకం సహించలేదు, మామయ్యా!

ఏదో ఒక ఉపాయంతో మన మధ్య కలహాలు పుట్టిస్తుంది. మన బ్రతు కుల్లో నిప్పులు కురిపిస్తుంది. మాట వరసకు — వితంతు వివాహం చేసుకొని ఒక గొప్ప పని చేశావని నిన్ను కీర్తిస్తుంది. అప్పుడు నువ్వా ప్రలోభాన్నుంచి తప్పించు కోగలవా?

ఎవరూ దొరకలేదనా వితంతువును పెళ్లాడావు? — అని పరిహసిస్తుంది. చిన్నతనం నుంచి సరోజను గుండెల్లో పెట్టి పూజించుకున్నానని చెప్పగలవా? అలా చెపితే, చూస్తూ ఎందుకు చేజార విడుచుకున్నావు? మళ్లీ ఇప్పు డొకరు ముట్టి విడిచాక ఎందు కందుకున్నావు? — అని ఈసడిస్తుంది. ఆ ఎకసక్కాన్ని భరించగలవా?

సరే, ఈ వ్యక్తిగతమైన నింద లన్ని టినీ భరించగల శక్తి మన అనుబంధమే ప్రసాదిస్తుందని నీ వనవచ్చు. దాన్ని నేను కాదనను. చిన్ననాటి నీ వాత్సల్యం ఎంత బలీయమైనదో నాకు తెలుసు. నిర్మలమైన నీ మనస్సుని ఏ నిందలూ మలినపరచలేవని నమ్మగలను. ఏ శక్తీ నీ మనఃస్థైర్యాన్ని సడలించలేదని విశ్వ సించ గలను. కాని, వీటన్నింటినీ ఎదుర్కో వలసిన జీవితంలో సుఖ శాంతుల కిక తావెక్కడిది? భార్యాభర్తలుగా అను బంధం ఏర్పడినంత మాత్రాన అది సుఖించట మవుతుందా!

ఇక వీటికి తోడు మనచుట్టూ మరి కొన్ని బాధ్యత లున్నాయి. నా చెల్లెలికి పెళ్లి కావాలి. మరి కొన్నేళ్ల తరవాత కమలకు పెళ్లి చేయాలి. ఈలోపల మనకు పిల్లలు — ఏమో! ఈ బాధ్య తల కంతెక్కడిది?

మనం పెళ్లి చేసుకో గలిగినంత సులువుగా అవుతాయా వాళ్ల పెళ్లిళ్ళు? వితంతు వివాహాలు, కులాంతర సంబం ధాలు, వరకట్న నిషేధాలు — ఇవన్నీ వందేళ్ల నుంచి మన దేశంలో వినబడు తున్న విషయాలే! కాని, ఎంతమంది ఆచరిస్తున్నారు? ఎంతమంది హర్షి స్తున్నారు?

ఈ దేశం మారిందా? ఈ మను ష్యులు మారారా? లేదు. మారలేదు. మరో శతాబ్దాని కయినా మారుతుందన్న ఆశ నాకు లేదు. ధైర్య మున్నవారికి ధనం లేదు. ధనమున్న వాళ్ల కా అవసరం లేదు: ఆశయం లేదు. ఇదంతా మన మనుషులు తమంతట తాము తమ చుట్టూ గీసుకున్న విష వలయం!

ఈ క్షణికోద్రేకంలో మన బ్రతు కంతా మల్లెపందిరి కింద పూలపాన్పులా ఉంటుందనిపిస్తుంది. కాని, ఫలించని ఈ అనురాగం లేనిపోని కొత్త సమస్యల్ని తెచ్చి పెడుతుంది. దానితో మన బ్రతు కంతా పరస్పరమైన నిందలతో తెల్ల వారుతుంది. ఆ జీవితం నరక సదృశం, మామయ్యా! నా మాట విను. మన మెన్నో అనుకుంటాము. మరెన్నో కావా లనుకుంటాము. ఇది కథ కాదు, సినిమా కాదు — ఈ విధంగా ముగింపు ఉంటుంది అని అనుకోవటానికి. ఇది జీవితం, ఇది వాస్తవం. అందుకనే మన మనుకున్నవన్నీ జరగవు. ఆశించినవన్నీ చేతి కందవు.

నా ఒక్క జీవితంలో వసంతం కురిపిం చాలని మరెందరి జీవితాల్లోనో శిశిరం పేరుకోనీకు. మరెన్నో ఏళ్ల సమస్యలకు ప్రస్తావన చెయ్యకు. ఇంక నాపై పెట్టుకున్న పిచ్చి ఆశలతో నీ జీవితాన్ని నీరసం చేసుకోకు.

> ఈ విశాల ప్రపంచంలో నేరం చేసినవాడు దాక్కునే స్థలం లేదు. ఎక్కడకు వెళ్లినా, అతని నేరం బయట పడుతూనే ఉంటుంది.
>
> —ఎమర్సన్

నాపెళ్లి నాటికి ఏ పదవిలోనూ లేని నువ్వు ఈనాడు మరొకరి భారాన్ని మోయగల స్థితిలో ఉన్నావు. అదొక అదృష్టం! చేయాలనుకున్నంతమాత్రాన అందరూ అన్నీ చేయలేరు. అది కొందరికే కలిసివస్తుంది. కొందరినే చూసి వరిస్తుంది.

ఎందరో తల్లిదండ్రులు తమ బిడ్డ లకి పెళ్లిళ్ళు కాక నిస్పృహల పాలవు తున్నారు. నువ్వు ఒప్పుకోవాలే కాని, నాకంటె అందమైన వాళ్ళు, నాకంటె బాగా చదువుకున్న వాళ్లు నీ కెంతో మంది ఎదురుపడతారు. నువ్వు నిర్ణ యించుకుంటే ఒక కన్నెపిల్ల జీవితం స్థిరపడుతుంది! ఒక తండ్రి గుండెల మీద కుంపటి దిగుతుంది.

ఒకరి సమస్యల్ని పరిష్కరించటం మంచిదా, లేక మనకు మనమే మరికొన్ని సమస్యల్ని సృష్టించుకోవటం భావ్యమా? ఆలోచించు, మామయ్యా!

'నిన్నింతగా ఆరాధించే నన్ను మరిచిపో మంటావా? ఎలా మరవ గలను!' అంటూ నీ పిచ్చి ప్రేమలో నువ్వు సర్వస్వం తృణీకరించవచ్చు.

నీకోసం నా గతానుభూతుల్ని మరిచి పోలేనని నే ననటం లేదు, మామయ్యా! అసలు నీ జీవితంలో నేను ప్రవేశించ రాదనే అనుకుంటున్నాను. నీకోసం, నీ కిచ్చిన మాటకోసం నీవేం చెయ్యమన్నా చేస్తాను. కాని, ఇప్పటి నీ మాట విని నీకు తరవాత దుఃఖదాయిని నవుతానని తెలిసి నప్పుడు నాకు నేనుగా నీ జీవితంలోకి ఎలా నడిచి రాగలను? అదే నా భయం.

నా సుఖం కోసం నేను నా మనస్సు నెట్లా మార్చుకోవాలని ఆశిస్తున్నానో, నీ సుఖంకోసం, తద్వారా అందరి ఆనందం కోసం నీ మనస్సు నట్లా మార్చుకోమని నేను అర్థిస్తున్నాను. ఒక ఇంటివాడివై మా అందరికీ కన్నుల పండుగ చేయమని ప్రార్థిస్తున్నాను.

మనుషులు మారని ఈ కాలంలో మన మనస్సులే మార్చుకోవాలి, మామయ్యా! తప్పదు. నా భయాలు ఉత్త భయాలు మాత్రం కావు. ఖండించ లేని నిజాలు. ఈ నిజాన్ని భరించే ఆత్మ స్థైర్యం నీలో కలగాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను. సెలవు.

—సరోజ." ★